నేడు ఉచిత వైద్య శిబిరం

కేపీహెచ్‌బీ కాలనీ : రాందేవ్‌రావ్ వైద్యశాలలో నేడు నిర్వహించే ఉచిత డెర్మటాలజీ, ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాల సీఈఓ ఎన్.యోబు తెలిపారు. వైద్యశాల ప్రాంగణంలో నేడు (ఆదివారం) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డా.స్వాతి, శ్రీహర్ష పర్యవేక్షణలో చెవి, ముక్కు, గొంతు, అలర్జీ , చర్మ సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

సమస్యలు అడిగి తీసుకుంటున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్ : కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం గాయత్రి నగర్ ఆర్కే సొసైటీ పార్కులను కార్పొరేటర్ సబిహా బేగం, అధికారులతో కలిసి పర్యటించారు. గాయత్రినగర్ సున్నం చెరువు పార్కులో నీటి వసతి లేక చెట్లు ఎండిపోతున్నాయని, స్ట్రీట్ లైట్లు పనిచేయడం లేదని, బెంచీలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రాజీవ్ గాంధీ నగర్ బస్తీ దవాఖాన పరిశీలించి, మందులు అందుబాటులో ఉంచాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాల ఐలయ్య, వీరారెడ్డి,నాగుల సత్యం, జాహేద్ షరీఫ్ బాబా, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ రియాజ్, మీర్జా అస్లాం బేగ్, సలావుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, ఇస్మాయిల్, అబ్దుల్ హమీద్, మాధవాచారి, పార్వ తమ్మ, ముత్యాల దుర్గ పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ : రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులను కోరారు. ముస్లింలకు పవిత్రమైన మాసం రంజాన్ మాసం అని.. మసీదుల వద్ద ప్రార్థనలు చేసుకోవడానికి అన్నిరకాల ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా మార్చాలని, నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

శేరిలింగంపల్లి : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యుఈ) ఆధ్వర్యంలో ఉమెన్ ఇంటర్నేషనల్ సమిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (డబ్ల్యుఐఎస్‌ఈ), బీ2బీ ఎక్స్‌పో 2025 గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ చైర్‌పర్సన్) నిర్మలా జగ్గారెడ్డి, గౌరవ అతిథిగా ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుంచు గ్లోరీ స్వరూప హాజరయ్యారు. 108 మంది మహిళా వ్యాపారులను శక్తి అవార్డులతో సన్మానించారు. సీఓడబ్ల్యుఈ జాతీయ అధ్యక్షురాలు లలితా ఆలూరి, సీఓడబ్ల్యుఈ వ్యవస్థాపక డైరెక్టర్ సుమన్ కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి

దుండిగల్, మార్చి 1: గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి గాంధీ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 45 ఏండ్ల వరకున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి సూరారం బౌరంపేట క్రాస్ రోడ్ వద్ద ఉన్న స్నేక్ పార్క్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు స్థలానికి చేరుకుని మల్లారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. అతని వివరాలు తెలియ రాలేదు. ఒంటిపై తెల్లని పంచ, ఎరుపు టీ షర్టు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు దుండిగల్ పోలీసులకు తెలపాలని కోరారు.

ఎంఎల్ ఆర్ఐటీ కళాశాలలో..

దుండిగల్,మార్చి 1: మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎం ఎల్ ఆర్ ఐ టీ) కళాశాలలో శనివారం సంప్రదాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎంఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యను అందించడం తో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించాలనే లక్ష్యంతో ముందుకు వెలుతున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాసరావు, కేం క్లబ్ కో – ఆర్డినేటర్ సందీప్ , వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



అలరించిన కథక్, భరతనాట్య ప్రదర్శన

కొండాపూర్ : మాదాపూర్‌లోని శిల్పారామంలో కథక్, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. బెంగళూరు కథక్ కళాకారిణి అమ్రితా బనెర్జీ శివ వందన, తాల్ ధంగార్, లపక్ ఝూపక్ – తుమ్రి ప్రదర్శించి మెప్పించారు. వంశీ మాధవి బృందం గోపిక, అర్చిష్మాతే , గాయత్రి , జాహ్నవి, నైనిక పుష్పాంజలి, అలరిపు, దశావతార, తీరు పల్లాండు, తక్కువేమి మనకు, పదం, తిల్లాన అంశాలను ప్రదర్శించారు.

తైబజార్ ఫీజు వసూళ్లకు వేలం పాట

కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వారాంతపు సంత ఫీజు వసూళ్లకు 2025– 26 ఆర్థిక సంవత్సర నిర్వహణకు ఈ నెల 11న మున్సిపాలిటీ కార్యాలయంలో వేలంపాటను నిర్వహిస్తున్నట్లు కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. వేలంపాటలో హాజరయ్యే ప్రతినిధులు కొంపల్లి మున్సిపల్ ఆఫీసులో రూ. 1,00,000/– ధరావతు, రూ. 1,00,000/– సాల్వెంసి సర్టిఫికేట్ తో ఈ నెల 11 మంగళవారం రోజున వేలం పాట జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

జాబ్ ఫెయిర్‌కు..స్పందన

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 1: జేఎన్టీయూహెచ్ వర్సిటీలో నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్ కు మంచి స్పందన లభించిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ టి. కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం జేఎన్టీయూహెచ్ వర్సిటీ, నిపుణ, సేవా ఇంటర్నేషనల్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. జాబ్‌ఫెయిర్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొనగా..20వేల ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... విద్యార్థులు నిరుద్యోగులు జాబ్ ఫెయిర్‌లలో పాల్గొని, ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. కార్యక్రమంలో రెట్టార్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, యూఐఐటీ డైరెక్టర్ రజిని, డిప్యూటీ డైరెక్టర్ సురేశ్ పాల్గొన్నారు.

42 మందికి ఉద్యోగాలు

కేపీహెచ్‌బీ కాలనీ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 42 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ తెలిపారు. కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్ కేసీ, కి టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 75 మంది హాజరుకాగా.. మౌఖిక ఇంటర్వ్యూలో 42 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వార్షికవేతనం రూ.5.2 లక్షలు ఉందని తెలిపారు. టీఎస్ కేసీ కో –ఆర్డినేటర్ శ్రీనివాస రావు, కన్వీనర్ నాగార్జున, గణేశ్, అశ్విన్ కుమార్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానంపొందిన చిన్నారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల : తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని బీఆర్ఎస్ వీప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్‌కు చెందిన భూమేశ్, శ్రావ్యల ఏడాది కుమారుడు ఇషాన్ భూమేశ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. శనివారం ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. 26 దేశాల జాతీయ పతాకాలు, 26 రకాల పక్షులు, 18 రకాల పండ్లు, 22 రకాల కూరగాయలు, 11 రంగులు, 27 రకాల జంతువులు, 21 రకాల వాహనాల గుర్తింపుతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన చిన్నారిని ఎమ్మెల్యే అభినందించారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

కార్మికుల సంక్షేమమే ధ్యేయమని ఆంధ్రా పాలిమర్స్ యూనియన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వివేకానంద్‌అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఆంధ్రాపాలిమర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆవరణంలో యాజమాన్యానికి, కార్మికులకు మధ్య జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేతన సవరణను రూ.5,800 నుంచి 7,600 పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. హెచ్ఆర్ సురేశ్‌బాబు, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.రసూల్, ఉపాధ్యక్షులు బీఎంసీ రమేశ్, సంయుక్త కార్యదర్శి టి.రవి కిరణ్, ఆర్గనైజర్ డి.జోగారావు, కోశాధికారి ఎన్.శ్రీను పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

కుత్బుల్లాపూర్ : రంజాన్‌ను పురస్కరించుకొని మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అధికారులను ఆదేశించారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్లు, కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోని మసీదులు, ఈద్గాల వద్ద వసతుల కల్పనపై ఎమ్మెల్యే, అధికారులు, మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, డీసీలు మల్లారెడ్డి, నరసింహ, ఈఈ కిష్టప్ప, లక్ష్మీ గణేశ్ పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌లో 38 కేసులు నమోదు

కుత్బుల్లాపూర్ : పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో శనివారం సాయంత్రం చేపట్టిన విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా 38 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్‌వర్ధన్ తెలిపారు. రెండు బృందాలు తనిఖీలు చేయగా 38 ఓపెన్ బుజింగ్ కేసులు, ముగ్గురు గంజాయి కన్జ్యూమర్ లపై కేసులు నమోదు చేయడం చేసినట్లు తెలిపారు.

మాదిగ అమరులకు ఘననివాళులు

కుత్బుల్లాపూర్ : నియోజక వర్గంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చింతల్ మున్సిపల్ సర్కిల్ సమీపంలో శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ అధ్యక్షతన మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు అమరవీరుల ప్రాణ త్యాగాలు వృధా కాలేదని వర్గీకరణ సాధించుకున్నామన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నడుస్తామని జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్ మాదిగ అన్నారు.

వివాహిత ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు

కుత్బుల్లాపూర్ : భర్త, పిల్లలను వదిలి ప్రియుడుతో కలిసి వెళ్లిన వివాహిత ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాకు చెందిన మిరియం పల్లి పేరయ్య కుమారుడు గోపిని కంప్యూటర్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్‌కు పంపాడు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు హాస్టల్‌లో ఉంటూ కంప్యూటర్ నేర్చుకుంటున్నాడు. ఓ యాప్‌లో గోపికి వరంగల్ జిల్లా బావోజిగూడెంకు చెందిన సుకన్యతో పరిచయం అయింది. తరచూ ఫోన్ లో మాట్లాడుకొనే వారు. గమనించిన భర్త జయరాజ్ సుకన్యను మందలించాడు. గత నెల 5 న సుకన్య భర్త, పిల్లలను వదిలి గోపీని కలవడానికి నగరానికి వచ్చింది.. AP 39 JF 0742 బైక్ మీద వారు మేడ్చల్ ఆక్సిజన్ పార్కుకు వచ్చారు. నిఘా ఉంచి వెంబడించిన భర్త వారిని అడ్డగించాడు.. సుచిత్ర లో బైక్ ను వదిలి పరారయ్యారు. భర్త బైక్ ను తీసుకొని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో పిర్యాదు చేశాడు. కేసు నమోదుకున్న పోలీసులు బైక్‌నంబరర్ ఆధారంగా గోపి తండ్రి పేరయ్య ను శనివారం పిలిపించి ఆరా తీశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి పారితోషికం.. ఉగోరా అవార్డు

కేపీహెచ్‌బీ కాలనీ : ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు (ఉగోరా) జన్మదినం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి నగదు పారితోషికం, ఉగోరా అవార్డును ప్రదానం చేశారు. శనివారం కళాశాల ఆవరణలో ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు విద్యా వెంకట్ , కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ చేతుల మీదుగా కే. దివ్యకు నగదు ,అవార్డును అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... కళాశాలలో చదువుతున్న విద్యార్థినికి నగదు పారితోషికాన్ని అందించడం సంతోషకరమన్నారు. కంటి చూపు సరిగా లేకపోయినా విద్యార్థిని ఉత్తమ మార్కులు సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, అధ్యాపకులు నాగుల వేణు, సాయి కొండలు, జలీల్, ప్రవీణ్ రెడ్డి, పద్మ, మంజుల, గోపాల్, లక్ష్మణ్, ఉషారాణి, దశమ్మ, ప్రజా ఆలోచన వేదిక సభ్యులు సముద్రాల కిరణ్ పాల్గొన్నారు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి నగదు పారితోషికం అందిస్తున్న ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, సంస్థ అధ్యక్షుడు విద్యా వెంకట్

టిప్పర్ ఢీకొని ఒకరు మృతి

శేరిలింగంపలి : టిప్పర్ ఢీ కొని ఒకరు మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రపురం మండలం, గూడూరుకు చెందిన పిల్లి జ్ఞానేశ్వరరావు (37) మణికొండలో నివాసి. మేస్త్రీ పని చేసే అతడు పటాన్‌చెరులో మార్కండేశ్వర రావుతో కలిసి స్కూటీపై వెళ్తున్నాడు. శనివారం వట్టినాగులపల్లి ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్ రోడ్లో డంపింగ్ యార్డ్ సమీపంలో గుర్తుతెలియని టిప్పర్ వేగంగా దూసుకు వచ్చి వీరి స్కూటీని ఢీ కొట్టింది. జ్ఞానేశ్వర్ రావు అక్కడికక్కడే మృతి చెందగా మార్కండేశ్వర రావుకు తీవ్ర గాయాలయ్యాయి. టిప్పర్ డ్రైవర్ వాహనంతో పరారయ్యాడు. కేసు నమోదు చేసుకొని గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

అల్లాపూర్ : మోతీనగర్ పరిధి పాండురంగా నగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయ నూతన పాలక మండలి సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈవో సుధాకర్ ఆలయ చైర్మన్ బుచ్చన్నతో పాటు కమిటీ సభ్యులు రామకృష్ణారావు, నరసింహులు, అనుపమ, జనార్దన్, నరసింహారావు, మల్లికార్జున్ రెడ్డిలను ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏ, బీ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్పరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గోపిశెట్టి రాఘవేందర్, తూము సంతోష్, డివిజన్ అధ్యక్షులు సతీశ్ గౌడ్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కాలనీవాసులకే చైర్మన్ గా అవకాశం ఇవ్వాలి

శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఎంపికలో ఈవో సుధాకర్ అవకతవకలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ పాండురంగ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆలయ ప్రాంగణంలో ఆందోళన చేశారు. అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికే తనకు నచ్చిన వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారని కాలనీవాసులు ఆరోపించారు. 30 ఏండ్లుగా కాలనీవాసులు అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. తమకాలనీలోని ఆలయానికి కాలనీ వాసులనే చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. పాలకమండలి ఎంపిక సమాచారం ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించారని ఆరోపించారు. ఆలయ కమిటీ రద్దుచేసి, తమ కాలనీ వాసులకే చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పాండురంగ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్, పీ ప్రమీల, ఐలయ్య యాదవ్, రామాంజనేయులు, గోపాల్, ప్రసాద్, సుభాష్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న పాండునగర్ కాలనీవాసులు